కోనసీమ కథలు

# వామనుడు


పేరి కామేశ్వర రావు

"ఏరా రామం ఏం చేస్తున్నావ్?" అంటూ గుమ్మా నెక్కుతున్నాడాయన. పొట్టిగా గుమ్మటంలా ఉంటాడు. కడ్డీశరీరం. చామనచాయ. గోష్పాదమంత నగముడి.

నుదుటన విభూతిరేఖలు. భ్రుకుటి మధ్యంలో ఎర్రగా వెలుగుతున్న కుంకుమబొట్టు. మోకాళ్ళ దిగువదాకా పంచె. మెడచుట్టి ఓ ఉత్తరీయం కిందికి వేలాడుతోంది వీపుమీదుగా, బరువుగా. దాని చివర ఓ ఇత్తడి చెంబు నడుస్తోంటే ఇటూ అటూ ఊగుతూ వీపుకి తగుల్తోంది.

గుమ్మాలెక్కి, వెనుకనున్న చెంబును ముందుకి లాగి అరుగుమీద చతికిలబడి, మెడచుట్టూ ఉన్న ఉత్తరీయాన్ని వదులుచేఎి, చెంబు పక్కనే పెట్టాడు.

వలకరించిన ఉత్తర క్షణంలో వీధిసావిట్లో



ధాన్యం కొలుస్తున్న రామ్మూర్తిగారు అరుగుమీదకు వస్తూనే రెండు చేతులూ జోడించి నమస్కరించారు.

"దీర్ఘాయిష్మాన్ భవ" అని ఆశీర్వదించాడు వామనుడు.

"నరానరి నేదునూరు నుంచేనా?" అన్నారు రామ్మూర్తిగారు.

తలెత్తి రామ్మూర్తిగారిని చూశా డాయన. ఆరడుగుల భారీ శరీరం రామ్మూర్తిగారిది. ఎర్రని ఎరుపు. ఆయన నుదుటన విభూతిరేఖలు ప్రస్ఫుటంగా కనవడవు కాని- సిందూర తిలకం నిటారుగా నిల్చుని జ్వాలా శిఖలా వెలుగుతూ ఉంటుంది. వెనకాల పెద్దముడి. చెవులకు కుండలాలు. రామ్మూర్తిగారు గొప్ప రామభక్తుడు.

వామనుడో లలితోపానకుడు.

"ఆ! నేదునూరు నుంచే. ఓసారి అమ్మాయిని పిలు. ఈ పూట మీ ఇంట్లో వారం చెప్పుకుంటాను" అన్నాడు.

"అయ్యో! దానికేం భాగ్యం? ఏమేవ్, నిన్నే! ఓసారి ఇలారా" అని కేక పెట్టారు రామ్మూర్తిగారు.

లోవలి నుంచి వస్తోందావిడ. కచ్చపోసి కట్టిన వట్టుచీర. మెడలో నల్లపూసల సౌరు మెరుస్తోంది. పుస్తెల గొలుసు కనపడీ కనపడకుండా ధగధగమంటోంది. చెవులకున్న గడాల దుద్దులు కాంతులీనుతున్నాయి. ఓ ముక్కు శోణానికి నిమ్మగుత్తి వేలాడుతోంది. మరో ముక్కు శోణానికి బేసరి ఉంది. అడ్డబాస ముక్కు కిందుగా కదులాడు... ళుక్కుమంటోంది.

వనువు రానుకుని స్నానం చేసి జారుముడి వేసుకుంది. ముఖం మీద పెద్ద రూపాయ కాసంత బొట్టు పవిత్రతను సంతరించుకుని వెలిగిపోతోంది. కాళ్ళకు కడియాలు, వాటి కింద గొలుసులు. నడుస్తుంటే ఘల్లు ఘల్లుమంటున్నాయి. చేతులకు రెండేసి జతల బంగారుగాజులు మట్టిగాజులతో కలిసి నిండుగా ఉన్నాయి.

ఎడమచేతి ఉంగరపు వేలికి కనకపుష్యరాగపు ఉంగరం.

కుడిచేతికి రాయి లేకుండా రావి ఆకు ఆకారంలో మరో ఉంగరం.

మల్లె మొగ్గల్లాంటి తెల్లటి పలువరుస. పలితకేశాలతో కలిసి చిరునవ్వులు చిందిస్తూ ఉండగా వచ్చి—"ఎంత సేపయింది వచ్చి? కాళ్ళూ చేతులూ కడుక్కోండి బాబాయిగారూ! వంటయిపోయింది" అంది.

చెంబుకున్న ముడివిప్పి చెంబు ముందుకు జరిపి—

"అమ్మాయ్! ఇదిగో పెసరపప్పు. నీ చేత్తో కాస్త కరివేపాకు, కాసిని సీమ్మిరపకాయలు, ఇంత జీలకర్ర, ఇన్ని ఆవాలు, ఇంగువ, ఓ ఎండుమిరప చిదిపి, వండి పెట్టమ్మా! కాస్త చారు కూడా పెట్టు చాలు" అన్నాడు.

"ఇప్పుడా చెంబులో పెసరపప్పు వాడక్కర్లేదు. మీరు చెప్పినట్టుగానే వండాను. పిండుకుందికి నిమ్మకాయ కూడా ఉంది. పొద్దున్నే లేవగానే మీ అల్లుడు ఇదే పురమాయించారు" అని నవ్వింది.

ముసి ముసిగా నవ్వుతూ రామ్మూర్తిగారూ—

"మామగారు వస్తున్నారని మనసుకు తెలిసింది కాబోలు. అది వాగ్రూపమైంది. ఆవిడ ఆచరించింది" అన్నారు.

"ఒరేయ్ రామం! దాన్నే ఇంకా సాధన చేస్తే మనోరూప విద్య పట్టుబడుతుంది. ఆ విద్య వల్ల—" అంటూ ఆవిడకేసి చూస్తున్నవాడల్లా ఆగిపోయారు. మరోసారి ఆవిడ ముఖంవైపు చూసి తలదించుకొని ఓ నిట్టూర్పు విడిచాడు.

"ముందు మీరు లేవండి. ఆ చెంబు అలాగే కవాచీ బల్లమీద పెడతాను. కాళ్ళూ చేతులూ కడుక్కొస్తే మడిబట్ట సిద్ధం చేసి ఉంచుతాను" అంటూ లోనికి దారి తీశారు రామ్మూర్తిగారు.

భోజనాలు కానిచ్చి ఉయ్యాల బల్లమీదకు వామనుడు, కవాచీ బల్ల మీదకు రామ్మూర్తిగారూ చేరారు. తాంబూల సేవనం జరుగుతోంది.

వరుగెత్తుకుంటూ ఓ వదిహేనేళ్ళ కుర్రవాడు లోవలకు వస్తూ ఉయ్యాల బల్ల మీద వామనుణ్ణి చూసి—

"నమస్కారం తాతయ్యా! ఎప్పుడొచ్చారు?" అన్నాడు.

"భోజనం కూడా అయిపోయిందిరా తాతా" అని తాంబూలంతో ఎరుపెక్కిన నాలిక చాపి హాయిగా నవ్వాడాయన. వాడు ముసిముసిగా నవ్వుకుంటూ లోపలకు చక్కాపోయాడు.

"వీడి భవిష్యత్తు ఎలా ఉంటుందో!" మనసులోని మాట పైకే అనేశారు రామ్మూర్తిగారు.

"వాడికేంరా! నో రెట్టుకుబతుకుతాడు. కాలమాసు పరిస్థితులకు తట్టుకుంటారులే. భయంలేదు. ఇల్లు కూడా కడతాడు. మగ సంతానమే లేదు. అయినా వాడి బతుకు వాడు బతగ్గలడు" అన్నాడు వామనుడు.


అంతతో ఆ ప్రస్తావన ఆగిపోయింది.

నాలుగింటికి కాస్త టీ తాగి చక్కాపోయా డాయన.

** ** **

శ్రావణమాసపు తొలిరోజులు. కాలువల నిండా నీరు గట్లను ఒరుసుకుని, పడిన వాననీటిని తనలో కలుపుకొని సాగిపోతోంది. ఎక్కడో ఒకటీ అరా రోడ్డు కాస్త బావున్నా చాలాచోట్ల చిత్తడి చిత్తడిగానే ఉంది. వర్షాకాలంలో కోనసీమ రూపే అంత. అంతా బురదమయం.

రాత్రి నుంచీ కుండపోతగా కురిసిన వర్షం రాత్రికి విశ్రమించి, ఉషోదయాన్నే సాగిన బాటసారిలా ఉదయాన్నే చక్కాపోయింది. ఫెళ్ళున ఎండకాసింది.



అరుగు మీద అప్పటికే సంధ్యావందనాది క్రియలు పూర్తి చేసుకుని కదురుమీద యజ్ఞోపవీతం వడుకుతూ, మాసికంగా గాయత్రీ మంత్రం ఉపాసిస్తూ కూర్చుని ఉన్నాడు వామనుడు.

అప్పుడు వినవడిం దో కేక. "తోటకూర...తోటకూరాయ్!" అంటూ.

తలెత్తి చూశారు. పది గజాల దూరంలో నెత్తిమీద పెద్ద గంపనిండా కూరతో వస్తున్నాడు ఆ ఊరి కాపు.

ఏదో ఒక ఆకుకూర అమ్ముతూ ఉంటాడు. బ్రాహ్మణ వీధిలో కొనేవాళ్ళు ఎవరూ లేకపోయినా ఆ వీధిగుండా అలా కేక వేసుకుంటూ వెళ్ళడం అతని కలవాటు.

ఆ అలవాటు చొప్పున వేశాడు కేక.

అప్పటికి దగ్గరగా వచ్చిన అతన్ని చూసి- "ఇలా రావోయ్, సుబ్బన్నా!" అన్నారు వామనుడు.

"దండాలండి, బాబయ్యగారూ!"

"ఎంత కిస్తావ్?"

"ఏంటండీ?"

"అదేనోయ్ ఆ గుంప కూరానూ."

"గంపకూరాండి! తవరికాండి? ఎందుకండీ ఇంత కూర?"

"మందులోకి కావాలి గాని ఎంత కిస్తావో చెప్పు."

"తవరి దయండి."

"ఆ గంపెడు కూర అమ్మితే నీకెంత వస్తుందోయ్!"

"ఒత్తాదండి రెండు మూడు రూపాయలు."

"అయితే సరే! ఆ డబ్బు నేనిస్తాను. ఆ కూర నాకిచ్చి నువ్వు తిన్నగా ఇంటికెళ్ళు. ఎక్కడికీ వెళ్ళకు. ఇంట్లోనే ఉండు. నీతో పనుంది. అవసరం అయితే కబురెడతాను."

"అలాగేనండి, బాబయ్యా! అయ్యబాబో! ఇదేంటండి అయిదు రూపాయ లిత్తన్నారు? మూడు సాలండి."

"ఫరవాలేదు. ఉంచుకో. నా మాట గుర్తుంది కదూ!"

"అయ్! ఎక్కడి కెళ్తానండీ! ఇంట్లోనే ఉంటాను. తవరు పిలిత్తే ఒత్తాను" అంటూ కూర అరుగుమీద దిమ్మరించి గంప తీసుకుని వెళ్ళియాడు సుబ్బన్న.

అత నటు వెళ్ళగానే భార్యను పిలిచా డాయన. లోవల దొడ్లో పాలేరుచేత పాదులు తవ్వించి కాలవలు కట్టిస్తూం దావిడ.

కేక విని వచ్చింది. అరుగుమీద పోగు కనవడింది.

"ఇదేమిటి?"

"తోటకూర."

"తెలుసులెండి. ఇంత కూర ఎక్కడిదా అని!"

"కొన్నాను. అది సరే... అందరిళ్ళకూ కాస్త కాస్త పంపించు. ఉన్నాడా సత్తిగాడు లోవల?"

"ఉన్నాడు గానీ మీ కేమైనా మతిపోయిందా! అసలు తోటకూర కొనడమేమిటి! పైగా గంపెడు కూరా! కొని ఊరంతా పంచమనడం ఏమిటి? నాకేం అర్థం కావడం లేదు మీ వరస."

"అదే అర్థమవుతుందిలే! ముందు చెప్పిన పని చెయ్యి" అన్నా డాయన.

మారు మాట లేకుండా లోపలకు నడిచిం దామె.

సత్తిగాడు ఆ వీధిలో ఇంకా తోటకూర కట్టలు

ఇస్తూనే ఉన్నాడు. ఈలోగా ఊరంతా గుప్పుమంది. తోటకూర అమ్ముకునే సుబ్బన్న పోయాడని.

"ఇది విన్నారా! పొద్దున్న గంపెడు తోటకూరా అమ్మాడట. జేబులో అయిదు రూపాయలూ అలాగే ఉన్నాయట. భార్యా పిల్లలూ ఒకటే గోల" అంటూ వచ్చిం దామె లోపల్నుంచి.

అరుగుమీద కూర్చుని ఉన్న వామనుడు- "వాడి కేక విన్నప్పుడే తెలుసు నాకు. ఎంతో సేపు ఉండడని. అందుకే అయిదూ నేనే ఇచ్చి కొన్నాను. వాడిని ఇంటికి పొమ్మన్నాను. లేకపోతే ఏ కాలవ గట్టుమీదో పోయుండేవాడు" అన్నా రాయన.

విస్ఫారిత నేత్రాలతో ఆయనకేసే చూస్తూ ఉండిపోయిం దామె.

*********

చూడడానికి పిట్టలా ఉన్నా ఆయన ఆయుర్వేదంలో దిట్ట. జ్యోతిర్విద్యలో ఘనుడు, వేదవేదాంగవేత్త, మంత్రశాస్త్రంలో ఘటికుడు.

చెప్పుకోదగ్గ ఆస్తి లేదు. అయినా ఆశించడు. చేయి చాచి ఎవరినీ అడిగిన పాపాన పోలేదు.

ఎప్పుడూ ఇంటి పట్టున ఉండడు. అలా ఊళ్ళు తిరుగుతూనే ఉంటాడు. ఎవరింటికి వెళ్ళాలనుకుంటే వాళ్ళింటికి వెడతాడు. వారి ఆదరణలో అక్కడ మకాంవేసి ఆ ఊరివాళ్ళ సందేహాలు తీర్చి, భూత ప్రేత పిశాచాదుల భయం ఉంటే పోగొట్టి, వాస్తులో దోషం ఉంటే చక్కదిద్దుకునే ఉపాయం చెప్పి, అనారోగ్యంతో బాధ పడుతూంటే వైద్యం చేసి చక్కాపోతాడు. ఏదీ అడగడు. కాని ఒక్క అర్థశేరో, పావు శేరో, శేరో పెసలు గాని, పెసర పప్పుగాని ఆయన అడక్కుండా ఎవరైనా ఇస్తే అవే ఆయనకు నూట పదహార్లూ, వెయ్యిన్నూట పదహార్లూ-మళ్ళీ మాట్లాడితే ధన, కనక, వస్తు, వాహనాలు ఆయనకు.

ఆయనను ప్రత్యేకంగా తమ ఊరు తీసుకువెళ్ళాలి అనుకునే వాళ్ళకు మాత్రం యాతనే ఆయన్ను పట్టుకోవడం.

ఎన్ని యాతనలు పడి అయినా సరే ఆయనవల్ల సహాయం పొందనివాళ్ళు కోనసీమలోనే కాదు, గోదావరీ మండలంలోనే లేరు.

ఒక ఊరి రాజుగారు ఓసారి ఆయనకోసం మనుమల్ని పంపారు. వారు ఊళ్ళన్నీ తిరిగి తిరిగి కోటిలింగాల ప్రాంతంలో ఉన్నారని విని అక్కడ కాపు వేశారు.

తెల్లగా తూరుపు రేకలు విచ్చుకుంటున్నాయి. పావంచాలెక్కి తడి అంగవస్త్రాలు పిండుకొని వాటినే గోచీపోసి కట్టుకుని, పిడిచి మడత వేసిన అంగవస్త్రాలు తలమీదుగా రెండు చెవులూ కప్పేటట్లు వేసుకుని, చెంబుల్లో నీళ్ళు నింపుకొని రామ్మూర్తిగారు, వామనుడూ 'అరుణం' చదువుకుంటూ గట్టు ఎక్కుతున్నారు.

సుస్వరంతో, శ్రావ్యంగా వారు చదువుతూ ఉంటే గోదావరిమాత రూపంలో సాగిపోతున్న వేదమాత పెదవులపై చిరు దరహాసం అలలు అలలుగా సాగుతోంది.

అలా వస్తున్న ఆ జంటను చూస్తూనే చేతులు జోడించి వచ్చిన రాజుగారి మనుమలు నమస్కరించారు. విషయం విన్నవించారు. రామ్మూర్తిగారు వాళ్ళకు చెప్పవలసింది చెప్పి పంపారు.

మళ్ళీ 'అరుణం' చదువుతూ ఇద్దరూ సాగిపోయారు.

రెండు రోజుల తరువాత ఒకనాటి ఉదయాన్నే ఒక పెద్ద మనిషిని వెంట బెట్టుకుని రాజు గారు ఆలమూరు - రామ్మూర్తి గారింటికి వచ్చారు. వచ్చిన వాళ్ళను పలకరించి అరుగు మీద కూర్చుండబెట్టారు

కొంత సేపయిన తరువాత లోపలి నుంచి వామనుడు బయటకు వస్తూనే - "వీళ్ళేనా?" అన్నారు. ఔనన్నారు రామ్మూర్తి గారు.

"అయితే నా ఆలస్యం ఏం లేదు" అంటూనే చక చక ముందు దారి తీశా డాయన. ఆయనతో రామ్మూర్తి గారు, వారి వెనుక వచ్చిన వాళ్ళూ సాగారు.

తొమ్మిదీ పది గంటల మధ్య రాజు గారి ఊరు చేరారు. ఊరి మధ్య పెద్ద రావి చెట్టు. దాని చుట్టూ సిమెంటు చేసి ఉంది. రావి చెట్టు చుట్టూ బయలు ప్రదేశం. దూరంగా ఒక దేవిడీ. ఆ దేవిడీ వైపు చూస్తూనే అడక్కుండానే అటే నడిచాడు వామనుడు. వెనుక మిగిలిన వాళ్ళూ అనుసరించారు.

దేవిడీకి ఎదురుగా ఉన్న ఒక రాతి బండ మీద కూర్చుని తదేకంగా దేవిడీ వైపే చూస్తున్నారాయన.

"రండి! లోపలకు వెళదాం" అన్నాడు రాజు గారితో వచ్చినాయన.

"నేనా? చచ్చినా లోపలకు రాను" అన్నాడు విసురుగా వామనుడు. అవాక్కయి పోయారు వాళ్ళు.

రామ్మూర్తి గారు ఆయన పక్కనే నిలుచుని ఉన్నారు.

"వినపడుతోందిరా రామం నీకు?"

"ఏవిటి మాశయ్యా?"

"ఏవిటేవిట్రా నీ మొహం. అదిగో ఆ ఇంట్లో ఇసప గజ్జెల తల్లి నడుస్తోంది. ఆవిడ అడుగుల చప్పుడు.

"అది సరే! ఈ ఇంటి యజమానికి ఏమైనా బుద్ధుందా? బంగారం లాంటి భార్య. మహాలక్ష్మిలా కలకలలాడుతూ ఇంట్లో దేవతలా ఇటూ అటూ తిరుగుతూ కన్నుల పండువ చేస్తుంటే వాడికదేం పోయేకాలం? ఆ?"

అది విన్న రాజు గారు కంగుతిని ఏదో అనబోతుండగా రామ్మూర్తి గారూ, రాజు గారితో వచ్చినాయనా సెగలు చేసి ఆపారు.

"ఆ ఇంట్లో పెద్దమ్మ పెద్ద పీట దూసుకుంటోంది. పాపం ఆ ఇల్లాలిని మహాక్షోభ పెట్టేస్తున్నాడు దుర్మార్గుడు. నా గుండె తరుక్కుపోతోంది" అని కోపంతో ఊగిపోతూ-

"అందుకే ఆ దరిద్రుడి కొంపలోకి నేను రానన్నాను" అన్నాడు.

"అలా అంటే ఎలా? మీరే ఏదో ఉపాయం ఆలోచించాలి. ఆవిడకు శాశ్వత సుఖం అందడానికి, అతని పాపాలకు విరుగుడూ మీరే ఆలోచించాలి."

> కస్టమర్: ఏమిటండీ...ఈ పుస్తకం వెల మూడు రూపాయలా? మొన్న మీ పనివాడు రెండు రూపాయలకే ఇచ్చాడే!
>
> షాప్ యజమాని: బహుశా వాడు మరిచిపోయి ఉంటాడు. ఆ మిగతా డబ్బులు కూడా ఇచ్చెయ్యండి ఇప్పుడు. —సగేష్

చిన్న చిరునవ్వు తొంగి చూసిందాయన ముఖంలో. అంతలోనే ముఖం గంభీరంగా పెట్టి - "వెధవ తిరుగుళ్ళు కట్టిపెట్టి - మహాలక్ష్మి లాంటి భార్యనే అంటిపెట్టుకుని ఉంటే ఒక రెండు మూడు తరాల పాటు పెద్దమ్మకు దేవిడీమన్నా ఇప్పించొచ్చు.

ఈ దేవిడీ ఖాళీ చేసెయ్యాలి. ఇందులో ఉండడానికి వీల్లేదు" అన్నాడాయన పెద్ద గొంతుతో.

రాజు గారితో వచ్చినాయన - "వీరికి మరో ఇల్లు ఉంది. ఆ వైపు రావి చెట్టు దాటిం తరువాత" అని అంటూండగానే-

పిట్టలాంటి ఆ మనిషి తూనీగలా దూసుకు పోయా డా వైపు.

పదిహేను నిముషాల తరువాత మిగిలిన ముగ్గురూ అక్కడకు చేరారు. అప్పటికే ఇంటి చుట్టూ తిరిగొచ్చారాయన.

తాళాలు తీశారు. ముందు ఆయన, వెనుక రామ్మూర్తి గారూ, ఆ వెనుక వచ్చినాయనా, ఆఖరున రాజు గారూ లోపలకు అడుగు పెట్టారు.

"నువ్వా నాయనా - ఈ ఇంటి యజమానివి? ఇల్లు శుభ్రంగా కడిగించు - వెల్ల వేయించు - నూతన గృహంలో ప్రవేశించేటట్లు ప్రవేశించు" అంటూండగానే తల వంచి నమస్కరించారు రాజు గారు.

"ఆయుష్మాన్ భవ - ఇదిగో ఇహ నీ సిరి సంపదలు నీ చేతిలో లేవు. నీ భార్యను సుపెట్టడంలో ఉన్నాయి. నీ సత్ప్రవర్తనలో ఉన్నాయి. నిన్ను నువ్వు అదుపులో పెట్టుకుంటే అంతా సవ్యంగా జరిగి నీ తరువాతి తరాలకు కూడా లాభిస్తుంది. పోగొట్టుకున్నదంతా సంపాదిస్తావ్" అంటూ ఇల్లంతా కలయ తిరిగి - తనలో తానే ఏదో గొణుగుతూ బయటికొచ్చి - "శుభమస్తు - రారా రామం" అంటూ సాగి పోయా డాయన.

దూరంగా - వెళ్తున్న ఆ ఇద్దరూ రెండు వెలుగులై భాసించగా మనస్సుతోనూ, చేతులతోనూ ఒకేసారి నమస్కరిస్తూ ఉండిపోయారు రాజు గారు.

పక్కనున్న పెద్ద మనిషి- "ఆయనంతే. ఎలా వస్తాడో అలాగే వెళ్ళిపోతాడు. ఏదీ అడగడు - చేతిలో పెడితే పుచ్చుకోడు. అందుకే ఒక బస్తా పెసలు ఇంటికి పంపే ఏర్పాటు చేశాను" అన్నాడు.

గాంభీర్యానికి మాధుర్యం జత చేసి గళం విప్పి - నెలల తరబడి ఒకే వేదికపై భారత రామాయణాలు గానం చేస్తూ ధర్మ ప్రచారమే జీవితంగా సాగించిన - పురాణ పండ రామ్మూర్తి గారే మన రామ్మూర్తి గారు.

ఎప్పుడూ ఉల్లాసంగా ఉంటూ తండ్రి వదిలిన ఆస్తిగా ఆ ధర్మ ప్రచారానికే నిశ్చయించుకుని, రెండు దశాబ్దాల పాటు ఆకాశవాణిలో పని చేసి, తనదీ అంటూ ఒక ప్రత్యేకత సంతరించుకున్న ఉషశ్రీ ఆ పదిహేను సంవత్సరాల కుర్రాడు.

నిజంగానే నోరెట్టుకు బ్రతుకుతున్నవాడు.

ఇహ ఆ వామనుడు మరెవరో కాదు.

శ్రీధర వెంకయ్య గారు.

అంటేనే చాలు, వెనుకటి తరం వారి గుండెల్లో వామనుడై కదిలి త్రివిక్రముడై భాసిస్తాడు.

కేవలం పరోపకారమే ఊపిరిగా జీవించిన మహా మనిషి. ✶